ప్రత్యేక ఓటరు నమోదును విజయవంతం చేయండి

ఆదోనిరూరల్: స్పెషల్ సమ్మరీ రివిజన్–2024లో భాగంగా శని, ఆదివారాల్లో జరిగే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ అభిషేక్కుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బూత్ లెవల్‌లో ప్రతి ఒక్క బీఎల్‌వో అందుబాటులో ఉండి 2024 జనవరి నాటికి 18, 19 సంవత్సరాలు కలిగిన నూతన ఓటర్ నమోదు ప్రక్రియ, ఫొటో సిమ్లారీ ఎంట్రీస్, డెమో గ్రాఫికల్లీ ఎంట్రీస్, ఎంట్రీ సంబంధించి ఒక ఓటర్ రెండు చోట్ల ఓటు హక్కు కలిగి ఉంటే వారు నోటీసు ద్వారా ఏ చిరునామాకు సంబంధించిన ఓటు హక్కును వినియోగించుకుంటారో వివరాలు తీసుకొని ఒక చోట మాత్రమే ఓటు వినియోగించేటట్లుగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్ కార్డులో పేరు, చిరునామా, లింగం తదితర వాటిల్లో తప్పులు ఉంటే వాటిని సరి చేసుకోవడానికి సంబంధించిన ఫారాలతో దరఖాస్తు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ (ఎలక్షన్) ఇజాజ్‌అహ్మద్, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రక్రియ పరిశీలన..

పెద్దతుంబళం గ్రామంలోని నేషనల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, మండల పరిషత్ పాఠశాలలో నిర్వహిస్తున్న క్యాంపెయినింగ్‌ని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి నూతన ఓటర్ నమోదు, ఫొటో సిమ్లారీ ఎంట్రీస్, డెమో గ్రాఫికల్లీ ఎంట్రీస్ గురించి బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి పలు సూచనలు చేశారు. డీఎల్‌పీఓ కార్యాలయపు పరిపాలనాధికారి వీరభద్రప్ప, సీనియర్ సహాయకులు ఖాసీం ఉన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్,


సమావేశానికి హాజరైన అధికారులు


కోసిగిలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఎంపీపీ ఈరన్న,


ఓటరు నమోదుపై సూచనలు ఇస్తున్న తహసీల్దారు

కోసిగి: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామాల్లో రెండు రోజుల పాటు నిర్వహించే ఓటరు జాబితా స్పెషల్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకుని 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ ఈరన్న కోరారు. శనివారం స్థానిక 118, 119 పోలింగ్ బూత్‌లలో ఓటరు జాబితాను పరిశీలించారు. ఓటరు జాబితాల్లో తప్పులు సరిచేసుకోవడానికి, పేర్లు లేని వారు నమోదు చేసుకోవాలని సూచించారు. ఉరుకుంద ట్రస్ట్ బోర్డు మెంబర్ బుళ్లి నరసింహులు, బీఎల్‌ఓలు ఉన్నారు.


పెద్దతుంబళంలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్

కౌతాళం: ఓటరు నమోదుకు ప్రభుత్వం చివరి అవకాశం కల్పించిందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు జరుగుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని కౌతాళంలోని బూత్‌కు వెళ్లి పరిశీలించి బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు.

అభ్యంతరాలు ఉంటే తెలియజేయండి..

పెద్దకడబూరు : ఓటర్ నమోదులో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దారు వీరేంద్రగౌడ్ తెలిపారు. నాలేకల్లులో ఓటరు నమోదుపై నిర్వహించిన ప్రత్యేక క్యాంపెయిన్‌ను శనివారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ 18సంవత్సరాలు నిండిన యువతీ యువకులు కొత్తగా ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలని సూచించారు. అక్రమ ఓట్లకు పూనుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటు నమోదుపై బిఎల్‌ఓలు అప్రమత్తతో వ్యవహరించాలని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దారు మహేష్‌కుమార్ ఉన్నారు.


నాలేకల్లులో ప్రత్యేక శిబిరాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దారు వీరేంద్రగౌడ్

క్లుప్తంగా

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు


దర్గా ఆల్బమ్‌ను అందజేస్తున్న నిర్వాహకులు

ఆదోనిటౌన్: పట్టణంలోని హజరత్ సయ్యద్‌షాహి తాహెర్‌ఖాద్రి దర్గాను ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు, యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి శనివారం దర్శించుకున్నారు. స్వామివారి ఉరుసు సందర్భంగా ప్రత్యే ఫాతెహాలు సమర్పించారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ నిర్వాహకులు మనోజ్‌కుమార్‌రెడ్డికి ఆల్బమ్‌తో పాటు శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముస్లీం, మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ నియాజ్‌అహ్మద్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ మాబాషా, నిర్వాహకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: జాతీయస్థాయి సీనియర్ కబడ్డీ పోటీలకు ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని కవిత ఎంపికైందని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్ తెలిపారు. కళాశాల చైర్మెన్ విట్టా సతీష్, కరస్పాండెంట్ దైవాదీనం రెడ్డి శనివారం విద్యార్థినిని అభినందించారు. వారు మాట్లాడుతూ కళాశాలలో బీకాం సెకండియర్ చదువుతున్న కవిత జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపడంతో జాతీయ జట్టుకు ఎంపికైందని చెప్పారు. ఈ నెల 12వ తేదీన పంజాబ్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర మహిళా జట్టుకు ప్రాతినిధ్యం వహించనుందన్నారు. పీడీ కంబిరెడ్డిని అభినందించారు.

పరిశుభ్రత కిట్ల పంపిణీ

కోసిగి: ప్రభుత్వం పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచేందుకు శానిటేషన్ లిక్విడ్ కిట్లను కేటాయించిందని ఎంఈఓ నాగేశప్ప తెలిపారు. శనివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న మండలంలోని వివిధ పాఠశాలల హెచ్‌ఎంలకు వాటిని అందజేశారు. మండలంలోని 48 పాఠశాలలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కలిపి 292 బాక్స్‌లు వచ్చాయని చెప్పారు. ఉపాధ్యాయులు పాఠశాలలో టాయిలెట్స్, బాత్‌రూమ్స్, గదులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. బాలికల పాఠశాల హెచ్‌ఎం సంజన్న, సీఆర్‌పీలు ఉశేని, యోహాన్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ వీరారెడ్డి పాల్గొన్నారు.

మాధవరం పోలీస్ స్టేషన్ తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ సీతారామయ్య

మంత్రాలయం : మండల పరిధిలోని మాధవరం పోలీస్‌స్టేషన్‌ను ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సివిల్, క్రిమినల్ కేసుల రికార్డులను పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ..స్టేషన్ పరిధిలోని కేసులు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ కిరణ్ బాబు ఉన్నారు.

ఎంఈఓపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న శ్రీరాములుగౌడ్

మంత్రాలయం : నిబంధనలకు విరుద్ధంగా వ్యవరిస్తున్న ఎంఈఓ మొయినుద్దీన్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీరాములుగౌడ్ కోరారు. శనివారం స్థానిక జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంఈఓ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. టీచర్ల శిక్షణ, సీఆర్పీ కార్యాలయ నిధులు స్వాహా చేశారన్నారు. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంతో చేతులు కలిపి ప్రభుత్వ నిబంధనలను తుంగ తొక్కారన్నారు. మధ్యాహ్న భోజనం, మన బడి– నాడు నేడు పనుల్లో భాగంగా రంగులు వేయడంలోనూ అవినీతి చేశారని ఆరోపించారు. జిల్లా విద్యాశాఖాధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమాఖ్య జిల్లా కార్యదర్శి షాబీర్ బాషా, జిల్లా సహాయ కార్యదర్శులు విజేంద్ర, థామస్, తాలూకా నాయకులు వీరేష్, అరవింద్, గోవిందు పాల్గొన్నారు.

7 న టెంకాయలు, తలనీలాల వేలంపాటలు

మద్దికెర: పెరవలి గ్రామంలో శ్రీరంగనాథస్వామి ఆలయం వద్ద టెంకాయలు, తమలపాకులు, తలనీలాలు సేకరణకు ఈనెల 7న వేలంపాటలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ టెంకాయలు వేలంపాటకు రూ.50 వేలు, తలనీలాలకు రూ. లక్ష ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలన్నారు.

సామాజిక తనిఖీలో రూ.2.19లక్షల అవినీతి

- రూ.1.80లక్షల రికవరీ, రూ.39వేలు రికవరీ చేయించాలని ఆదేశం


బహిరంగ విచారణ చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ సలీం బాషా

కోసిగి: మండలంలో ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనుల్లో రూ.2.19 లక్షల అవినీతి బయట పడిందని డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా తెలిపారు. శనివారం స్థానిక స్త్రీ శక్తి భవన కార్యాలయ ఆవరణలో ఎంపీపీ ఈరన్న, సర్పంచ్ అయ్యమ్మ, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 24 పంచాయతీల్లో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు ఉపాధి హామీ పథకం కింద వివిధ రకాల పనులు చేపట్టారు. ఇందులో 3.56 లక్షల మంది కూలీలకు 982 పనులు చేయగా రూ.8,33,19,790 ఖర్చు చేశారు. అలాగే పంచాయతీ రాజ్ శాఖ కింద 53 రోడ్డు పనులు చేయగా రూ.2,28,29,447 ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇందుకు గానూ ఈనెల 15 నుంచి ఈనెల 27వ తేదీ వరకు వివిధ గ్రామాల్లో సామాజిక తనిఖీలు చేపట్టారు. ఐరన్‌గల్లు గ్రామంలో పంచాయతీ రాజ్ కింద రోడ్డు పనులకు రూ.20వేలు ఖర్చు చేయగా రూ.2లక్షలు నగదు జమ చేశారు. ఇందులో రూ.1.80 లక్షలు రికవరీ చేయించారు. ఉపాధి కూలీల కింద రూ.39వేలు రికవరీ చేయించాలని ఏపీఓ జయరాంను ఆదేశించారు. కార్యక్రమంలో వాటర్ షెడ్ అడిషనల్ పీడీ మాధవీలత, ఆదోని ఏపీడీ లోకేశ్వర్, క్లస్టర్ కోఆర్డినేటర్ గిడ్డయ్య, ఈసీ, టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి..

ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం కృషి చేస్తోందని, బ్యాంక్ రుణాలతో ఆర్థికంగా ఎదగాలని పీడీ సలీంబాషా సూచించారు. శనివారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఏపీఎం సత్యమ్మ ఆధ్వర్యంలో గ్రామైక్య సంఘ లీడర్లు, వీబీకేలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మహిళలకు చైతన్యం కల్పించి బ్యాంక్ రుణాలు తీసుకుని సద్వినియోగం చేసుకునేలా చూడాలని చెప్పారు.


20 వరకు నీరు విడుదల చేయండి


ఎల్లెల్సీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఆదోనిరూరల్: ఈనెల 20వ తేదీ వరకు ఎల్లెల్సీ కాలువకు సాగునీరు విడుదల చేయాలని ఎల్లెల్సీ నీటి వాటా సభ్యులు సాయిబాబా, రైతులు కోరారు. ఈ మేరకు శనివారం ఎల్లెల్సీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సాయిబాబా మాట్లాడుతూ తుంగభద్ర డ్యామ్ బోర్డు పరిధిలోని ఆంధ్రప్రదేశ్‌లో 1,53,000 ఎకరాల సాగుభూమి ఉందని, వీటికి తుంగభద్ర కాలువ నీరే ప్రధాన వనరన్నారు. తుంగభద్ర కాలువ కింద మిరప, పత్తి పంటలు ఎక్కువగా పండిస్తున్నారన్నారు. ఈ యేడాది బోర్డు మీటింగ్‌లో కాలువలకు నవంబర్ 30వ తేదీ వరకు నీరు ఇవ్వాలని నిర్ణయించారన్నారు. అయితే నవంబర్‌లో డ్యాం పరివాహక ప్రాంతంలో వర్షాలు కురవడంతో అదనంగా 4 టీఎంసీల నీరు రిజర్వాయర్‌లో చేరిందని, దీంతో రైతులకు ఇంకొన్ని రోజులు నీరు ఇవ్వడానికి అవకాశం ఉందన్నారు. కావున మొదట నిర్ణయించిన దాని ప్రకారం నవంబర్ 30 వరకు కాకుండా డిసెంబర్ 20వ తేదీ వరకు దాకా నీటిని విడుదల చేస్తే పంటలకు మేలు చేకూరుతుందన్నారు. రైతులు దస్తగిరి, అయ్యన్న, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి

ఆదోనిఅర్బన్: మున్సిపల్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు 35వ వార్డు పంజరాపోల్ కాలనీలో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేసి వైఎస్సార్‌సీపీ కార్యదర్శి వెల్లాల మధుసూదనశర్మ శనివారం కాలనీ మహిళలకు తాళాలు అప్పజెప్పారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల సమయంలో వ్యక్తిగత మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని కోరారన్నారు. అప్పుడు ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి నెరవేరుస్తానని హామీ ఇచ్చారని, కౌన్సిల్ అనుమతితో రూ.7.80 లక్షలతో నిర్మాణం పూర్తి చేశామన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపింకుందామని వారిని కోరారు. నాయకులు రవికుమార్, అబ్రహం, అగ్గిరాముడు, తిక్కన్న, దీపమ్మ, సులోచనమ్మ పాల్గొన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న మధుసూదనశర్మ

విద్యార్థినులకు అభినందన


విద్యార్థినులతో ఉపాధ్యాయులు

కౌతాళం: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొని వచ్చిన బదినేహాల్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడు హరినాథ్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయుడు నరసింహారాజు, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు. వారు మాట్లాడుతూ గత నెల 26 నుంచి 28 వరకు గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరిగిన 33వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఖోఖో విభాగంలో జిల్లా జట్టు తరపున 8వ తరగతి చదువుతున్న షబానాబేగం, 7వ తరగతి చదువుతున్న వన్నూర్‌బీ ప్రతిభ చూపారన్నారు. ఉపాధ్యాయులు గంగధరయ్య, సిద్ధప్పప, శశిధర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ


లక్ష్మమ్మ ఫొటోను ఆర్‌బీఐఎస్ యాప్‌లో నమోదు చేస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ రవికుమార్

ఆదోనిటౌన్: పట్టణంలో రెండో రోజు శనివారం పింఛన్ల పంపిణీ కొనసాగింది. 21వ వార్డు ఎస్‌కేడీ కాలనీలో వృద్ధురాలు లక్ష్మమ్మకు శనివారం వెల్ఫేర్ సెక్రటరీ రవికుమార్ ఆర్‌బీఐఎస్ యాప్ ద్వారా పింఛన్ పంపిణీ చేశారు. లక్ష్మమ్మ వేలిముద్రలు పనిచేయకపోవడంతో ఐరిస్ ద్వారా పింఛన్‌ను పంపిణీ చేశామని ఆయన తెలిపారు. మరో రెండు రోజుల్లో పంపిణీ పూర్తి చేస్తామనిఅధికారులు తెలిపారు.

దున్నపోతు దాడిలో ఐదుగురికి గాయాలు

వెల్దుర్తి(కృష్ణగిరి): దున్నపోతు దాడిలో వెల్దుర్తి పట్టణానికి చెందిన ఐదుగురు గాయపడ్డారు. ఎస్సీ కాలనీలో పనుల్లో నిమగ్నమై ఉన్న మద్దమ్మ, లక్ష్మీదేవి, రాము, కృష్ణ, నర్సమ్మలపై దున్నపోతు దాడి చేసింది. క్షతగాత్రులను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. స్థానికులు అతికష్టం మీద దున్నపోతును అదుపులోకి తీసుకుని కట్టేయడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. కాగా దున్నపోతుకు సంబంధించిన వారు 9441296095, 9492991309 సంప్రదించి తీసుకెళ్లాలని పట్టణానికి చెందిన దేవరాజ్, పెద్దన్న కోరారు.

పౌష్టికాహారం ద్వారానే టీబీకి అడ్డుకట్ట

ఆలూరు: పౌష్టికాహారం తీసుకుని వ్యాధి నిరోధక శక్తి పెంచుకుంటే క్షయ వ్యాధికి అడ్డుకట్ట వేయొచ్చని క్షయ వ్యాధి నివారణ అధికారి గురుప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆలూరు సీహెచ్‌సీ పరిధిలో 250 మందికి క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని రోగులు సద్వి నియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్షయ నిర్మూలన ఎడ్యుకేటర్ గోపాల్ ఉన్నారు.

ఆధార్ కేంద్రాన్ని వినియోగించుకోండి

కోసిగి: స్థానిక సచివాలయం–4 లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ అయ్యమ్మ సూచించారు. శనివారం ఆధార్ కేంద్రాన్ని పరిశీలించి పనితీరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ మండల ప్రజలు ఆధార్ నమోదు కోసం ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని చెప్పారు. కొత్తగా ఆధార్ నమోదు, అప్‌డేట్, అడ్రస్‌లు మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని తెలిపారు.

పాఠశాలలో సౌకర్యాలు కల్పించండి

ఆదోని సెంట్రల్: పట్టణంలోని సెయింట్ ఆంథోని పాఠశాలలో సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బహుజన డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ పి.రమేష్ తెలిపారు. బీడీఎస్ఎఫ్ పట్టణ కమిటీ పాఠశాలలో సౌకర్యాలను శనివారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ పాఠశాలలో గదుల పైకప్పు పెచ్చులు ఊడిపోయి ప్రమాదకరంగా ఉన్నాయని చెప్పారు. యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను కోరారు. నాయకులు యోహాను, వెంకటేశ్,సాగర్, సంజయ్ పాల్గొన్నారు.

ఘనంగా సపోస్ క్రిస్మస్ వేడుకలు


ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని రాయనగర్ ఏపీ పాఠశాలలో సపోస్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం రాత్రి కాలనీలోని యవ్వనస్తుల అధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పాస్టర్లు క్రీస్తు బోధనలను వినిపించారు. సర్వమానవాళిని పాపమును నుంచి విముక్తి కలిగించడానికి ఏసుక్రీస్తు ప్రభువు లోకానికి వచ్చినట్లు తెలిపారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పాఠశాలలో సామగ్రి ధ్వంసం

హొళగుంద: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండుగులు బీభత్సవం సృష్టించారు. శనివారం ఉదయం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు గమనించి హెచ్‌ఎం నజీర్ అహమ్మద్‌కు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. కిటికీల గుండా లోపలికి చొరబడిన దుండుగులు తరగతి గదిలోని రూ.1.56 లక్షల విలువ చేసే ఐఎఫ్‌పీ డిజిటల్ టీవిని ధ్వంసం చేశారు. లేడీస్ స్టాఫ్ రూంలోని బీరువాలను పగలగొట్టి, ఫైళ్లను చిందవందర చేశారు. కుర్చీలు, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. దాదాపు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉండొచ్చని తెలుస్తోంది. విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. కాగా తాను నిద్ర పోయానని, ఇంత జరిగినా తనకు మెలకువ రాలేదని వాచ్‌మెన్ చెబుతుండటం గమనార్హం.

అటెండర్ మృతి

దేవనకొండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయం అటెండర్ అబ్దుల్‌సుకూర్ శనివారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంకటేష్‌నాయక్, రెవెన్యూ సిబ్బంది బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. దహన సంస్కారాల నిమిత్తం రూ.25 వేలు అందజేశారు.

జగన్‌తోనే గ్రామాల అభివృద్ధి


కడితోటలో సంక్షేమ పథకాలను వృద్ధురాలికి వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమైందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కడితోట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపను సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నవరత్నాలు అందుతున్నాయా లేదా అని ఆరాతీశారు. వివిధ పథకాల ద్వారా ప్రతి ఇంటికి రూ.3 లక్షల వరకు లబ్ధి చేకూరిందని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మంచి చేస్తున్న జగనన్న మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, ఎంపీడీఓ గీతావాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, హౌసింగ్ బోర్డు అధికారి తిప్పన్న, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆనంద్, సర్పంచ్ వీరేష్, వీరశైవ లింగాయతీ డైరెక్టర్ దేవిశెట్టి మంజుల, మండల గౌరవాధ్యక్షుడు గురునాథ్‌రెడ్డి, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రేణుక, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీలక్ష్మి, మండలాధ్యక్షుడు గురునాథ్‌రెడ్డి, కల్పవల్లి, ఫీల్డ్ అసిస్టెంట్ దర్గయ్య పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు


ఆంజనేయ స్వామికి హారతులు ఇస్తున్న అర్చకులు


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

కోసిగి: స్థానిక కడపాళెం వీధిలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయంలో కార్తీకమాస మూడవ శనివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. వేకువజామున నుంచి ఆలయ అర్చకులు దుర్గా ప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, వస్త్రాలంకరణ, వెండి కవచ అలంకరణ, ఆకు పూజ చేపట్టి మహా మంగళ హారుతులు ఇచ్చారు. భక్తులు తెల్లవారుజామున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. మండల కేంద్రంతో పాటు అగసలదిన్నె, బుడుములదొడ్డి, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళ హారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలు చేపట్టారు. బుడుములదొడ్డిలో భక్తులకు అన్నదానం చేశారు.

అర్హులందరికీ ఓటు హక్కు

నందవరం/వెల్దుర్తి/మద్దికెర/కృష్ణగిరి/ఆలూరు రూరల్/హాలహర్వి/చిప్పగిరి: పద్దెనిమిదేళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు కావాలని మండల అధికారులు సూచించారు. శనివారం నందవరం పోలింగ్ స్టేషన్–2, 3లలో ఓటరు నమోదు క్యాంపులను తహసీల్దార్ పరిశీలించి, బూత్ లెవల్ అధికారికి పలు సూచనలు చేశారు. వెల్దుర్తి మండలం చెరుకులపాడు పోలింగ్ బూత్ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాన్ని తహసీల్దార్ శివరాముడు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌రాజు, ఆర్ఐ మస్తాన్ పరిశీలించారు. మద్దికెర మండలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం, ఎడవలి, బొమ్మనపల్లి గ్రామాల పోలింగ్ బూత్‌లలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ నాగభూషణం తనిఖీ చేశారు. కృష్ణగిరి మండలం పుట్లూరు, అమకతాడు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ నమోదును తహసీల్దార్ రాజేశ్వరి పరిశీలించారు. ఆలూరు ఎంపీపీ మెయిన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన 128, 129 పోలింగ్ కేంద్రాల్లోని దరఖాస్తుల స్వీకరణను అసెంబ్లీ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ రామాంజనేయులు పరిశీలించారు. తప్పుల్లేని ఓటరు జాబితాను తయారు చేయాలని సిబ్బందికి సూచించారు. హాలహర్వి మండలం అమృతాపురం, సిద్ధాపురం, బల్లూరు, బిలేహాల్, కామినహాల్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ మల్లికార్జున స్వామి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగు నీటి సౌకర్యం, మరుగుదొడ్లు, కావాల్సిన మౌలిక సదుపాయాలు, కొత్త ఓటర్ల నమోదు వివరాలపై బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. చిప్పగిరి మండలం దౌల్తాపురం గ్రామంలో బీఎల్‌ఓ రంగన్న ప్రత్యేక ఓటరు నమోదు, వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు.


ఆలూరులో ఓటరు నమోదును తనిఖీ చేస్తున్న ఎన్నికల అధికారి

విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవాలి


ప్రోత్సాహక బహుమతులు అందుకున్న విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఆదోని సెంట్రల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థితికి చేరుకోవాలని ఆర్ట్స్ కళాశాల చైర్మెన్ విట్టా సతీష్ కళాశాల కరస్పాండెంట్ దైవాదీనం రెడ్డి తెలిపారు. ప్రిన్సిపాల్ మురళీమోహన్ అధ్యక్షతన శనివారం జరిగిన కార్యక్రమంలో గత ఏడాది ఇంటర్మీడియెట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం నగదుతో పాటు ప్రొత్సాహక బహుమతులను ప్రదానం చేశారు. కళాశాల జాయింట్ కార్యదర్శి పి. కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.